క్లుప్తంగా

గ్రంథాలయాలను సద్వినియోగించుకోండి



బొల్లాపల్లి: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వంకదారి సుబ్బరత్నమ్మ మంగళవారం తనిఖీ చేశారు. గ్రంథాలయ భవనాన్ని పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేసి అనంతరం మాట్లాడుతూ గ్రంథాలయాలను విజ్ఞానం కోసం సద్వినియోగపరచుకోవాలని తెలిపారు. గ్రంథాలయాలు దేవాలయాలతో సమానమని, విజ్ఞాన భాండాగారాల్లో విజ్ఞాన సముపార్జ న కోసం గ్రంథాలయాలకు యువత తరచుగా పుస్తక పఠనం కోసం రావాలని పిలుపునిచ్చా రు. గ్రంథాలయాల్లో అవసరమైన పుస్తకాల కోసం గ్రంథాలయ అధికారి వద్ద ఉన్న డిమాండ్ పుస్తకంలో తమకు అవసరమైన పుస్తకాల జాబితాను నమోదు చేసుకోవాలని సూచించా రు. విద్యార్థులు ఉన్నత శిఖరాలు అధిరోహించడానికి గ్రంథాలయాలు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. శాఖా గ్రంథాలయాధికారి ఆర్.సేవా నాయక్ ఉన్నారు.

నిందితులను వెంటనే శిక్షించాలి



వినుకొండ(నూజెండ్ల): కోల్‌కత్తాలో జూనియర్ డాక్టర్‌పై కిరాతకంగా లైంగిక దాడి చేసి హతమార్చిన హంతకులను వెంటనే ఉరి తీయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి ఉలవలపూడి రాము డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని పురవీధుల్లో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించి నిందితులను వెంటనే శిక్షించాలంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెంటనే దోషులను శిక్షించి బాధిత కుటుంబానికి న్యాయం చేయా లని కోరారు. లైంగిక వేధింపులపై కఠినమైన చట్టాలను తీసుకొచ్చి అమలు చేయాలన్నారు. కె.మల్లికార్జునరావు, జయరాం, అశోక్, ఆంజనేయులు, నాగలక్ష్మి, ప్రసన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రాంతాల్లో మద్యం తాగితే కఠిన చర్యలు



నరసరావుపేట రూరల్: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ సీఐ పసుపులేటి రామకృష్ణ తెలిపారు. పట్టణ శివారు ప్రాంతాల్లోని బహిరంగ ప్రదేశాల్లో మద్యం, గంజాయి వంటి మత్తు పదార్థాలను సేవిస్తున్నారని స్థానికుల నుంచి ఫిర్యా దులు రావడంతో రూరల్ పోలీసులు చర్యలు ప్రారంభించారు. కోటప్పకొండ రోడ్డులోని ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో యువకులు ఎక్కువగా సంచరించే ప్రాంతాలలో రూరల్ సీఐ రామకృష్ణ, ఎస్ఐ సి.హెచ్.కిశోర్‌లు మంగళవారం పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో ముళ్లపొదలు తొలగించడంతో పాటు విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టారు. అలాగే కోటప్పకొండ సమీపంలోని కెనాల్ మలుపు వద్ద పిచ్చిమొక్కల పెరిగి రోడ్డు ప్రమాదకరంగా మారడంతో జేసీబీతో పిచ్చిమొక్కలను తొలగించారు. దీంతో పాటు కోటప్పకొండ రోడ్డు జంక్షన్ వద్ద వాహ నాల తనిఖీ నిర్వహించారు. ద్విచక్రవాహనాలు నడుపుతున్న మైనర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు.

ఘనంగా మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి

నరసరావుపేట: జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో డీసీసీ అధ్యక్షులు అలెగ్జాండర్ సుధాకర్ ఆధ్వర్యంలో మంగళవారం మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి కేకు కట్‌చేసి నివాళులర్పించారు, అలెగ్జాండర్ మాట్లాడుతూ భారతదేశానికి అత్యంత చిన్న వయస్సులో ప్రధానిగా పనిచేసి దేశాన్ని ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్ రంగంలో అగ్రగామిగా చేసి యువతకి ఉపాధి అవకాశాలను కల్పించారని అన్నారు. అసెంబ్లీ నాయకులు ఎస్.ఎం. బాషా, పీసీసీ డెలిగేట్ సీదా కృష్ణ, మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు విజయలక్ష్మి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేసే గ్రామాలు

చిలకలూరిపేట: పసుమర్రు విద్యుత్ సబ్ స్టేషన్ మరమ్మతుల కారణంగా బుధవారం సాయంత్రం 3గంటల 4.15 వరకు మండలంలోని పలు గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ డీఈఈ ఆర్ అశోక్ కుమార్ తెలిపారు. మండలంలోని పసుమర్రు, గొట్టిపాడు, మానుకొండవారిపాలెం, ఈవూరివారిపాలెం గ్రామాలలో సంబంధిత వేళల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

భర్త అదృశ్యంపై ఫిర్యాదు

నరసరావుపేట రూరల్: స్థానిక ప్రకాష్‌నగర్ 60 అడుగుల రోడ్డుకు చెందిన చలపాటి బ్రహ్మయ్య అనే 40 ఏళ్ల వ్యక్తి మంగళవారం ఉదయం నుంచి కనిపించడం లేదని బ్రహ్మయ్య భార్య ప్రవీణ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మంగళవారం ఉదయం సుమారు ఐదున్నర గంటల ప్రాంతంలో వాకింగ్‌కు వెళ్లి తిరిగి రాలేదని, చుట్టుపక్కల విచారించామని, ఆచూకీ తెలియరాలేదని పేర్కొన్నారు ఆచూకీ తెలిసినవారు నరసరావుపేట రూరల్ పోలీస్ స్టేషన్, సెల్ నెంబర్ 800 899 0407కు తెలియచేయాలని పోలీసులు కోరారు.

మరమ్మతు



అద్దంకి బ్రాంచ్ కెనాల్ పరిధిలోని శావల్యాపురం మేజరు కాల్వకు గండి పడటంతో ఎన్నెస్పీ అధికారులు యుద్ధ ప్రతిపాదికన పనులు చేపట్టి సాగు నీరువృథా కాకుండా చర్యలు చేపట్టినట్లు ఎన్నెస్పీ డీఈ చాట్రగడ్డ రామారావు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ గతంలో ఈమేజరు పరిధిలోని కాల్వ నుంచి తాగునీటి అవసరాల నిమిత్తం గండి తీశారని ప్రస్తుతం సాగునీరు నిమిత్తం సాగర్ జలాలు విడుదల చేయగా నీటి ఉధృతి ధాటికి కాల్వకు గండి పడిందన్నారు. దీంతో కాల్వలో సాగునీరు పొలాల్లోకి వృథాగా పోతున్నాయని, అలాగే వరి నారుమడులు సాగునీరు లేక ఎండిపోతున్నాయని రైతులు ఎన్నెస్పీ అధికారుల దృష్టికి తేగా సత్వరమే పొక్లయినర్ ద్వారా పనులు చేసి సమస్య పరిష్కారించామన్నారు. సాగునీరు విషయంలో రైతులు ఎన్నెస్పీ అధికారులకు తమవంతు సహకరించాలన్నారు.

–శావల్యాపురం

ఆందోళన



స్థానిక మండల పరిషత్ కార్యాలయం ప్రాంగణంలో నోటీసులు అందుకున్న 52 మంది పింఛనుదారులు మంగళవారం ఆందోళన కార్యక్రమం నిర్వహించారు. మండలంలోని వయ్యకల్లు గ్రామానికి చెందిన వీరిని అర్హులు కాదని నోటీసులు అందజేయటం హేయమైన చర్య అని వైఎస్సార్ సీపీ నాయకులు దారా మోష వెల్లడించారు. ఎన్నో సంవత్సరాలుగా పింఛన్లు పొందుతున్న వారందరూ గతంలో అధికారులు ఆమోదించిన ధ్రువీకరణ పత్రాలు ఉన్ననటు వంటి దప్పు కళాకారులు, వికలాంగులు, చర్మకారులకు నోటీసులు అందజేశారన్నారు. క్షేత్రస్థాయిలో అధికారులు విచారణ చేయకుండానే కూటమి ప్రభుత్వం ఇలాంటి నిర్ణయాలను సత్వరమే ఉప సంహరించుకోవాలన్నారు. అనంతరం ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్యకు వినతిపత్రం అందజేశారు. ఆయనతో పాటు మాజీ ఎంపీటీసీ దారా లింగారావు ఫింఛనుదారులు పాల్గొన్నారు.

–శావల్యాపురం

గ్రామసభలను విజయవంతం చేయండి



వివరాలు తెలుపుతున్న ఎంపీడీవో సీతారామయ్య

శావల్యాపురం: జాతీయ ఉపాధి హామీ పథకంలో ప్రజలకు ఉపయోగకరమైన పనులు గుర్తించాలని ఎంపీడీవో పేరుమీనా సీతారామయ్య సూచించారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు మేరకు మండలంలోని 15 గ్రామపంచాయతీల్లో ఉపాధి నిధులతో చేపట్టబోయే పనులపై ఈనెల 23న అన్నీ గ్రామాలో ఉపాధి గ్రామ సభలు నిర్వహించాలన్నారు. ఈ ఉపాధి గ్రామ సభల్లో ప్రజాప్రతినిధులు అధికారులు అందరు సమన్వయంతో ఉండి ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలన్నారు. 2024–25 ఆర్థిక సంవత్సరంలో 46 రకాల పనులనే చేయడానికి ప్రభుత్వం ఆమోదించిదన్నారు. జాబ్‌కార్డు కల్గిన కుటుంబాలకు వంద రోజుల పని దినాలు కల్పించాలన్నారు. గ్రామస్థాయిలో గురించిన ఉపాధి పనులకు సంబంధించి ప్రజలు, అధికారులు, ప్రజాప్రతినిధుల ఆమోదంతో గ్రామసభల్లో తీర్మానాలు చేయాలన్నారు. ఆయనతో పాటు ఏపీవో రామారావులు పాల్గొన్నారు.

సర్దుబాటు నుంచి మినహాయించాలి

ఎస్టీయూ నాయకుల డిమాండ్



ఎంఈవో కె లక్ష్మికి వినతి పత్రం అందజేస్తున్న ఎస్టీయూ నాయకులు

చిలకలూరిపేట: మున్సిపల్ ఉపాధ్యాయులను సర్దుబాటు ప్రక్రియ నుంచి మినహాయించాలని ఎస్టీయూ పూర్వ రాష్ట్ర కార్యదర్శి పోటు శ్రీనివాసరావు కోరారు. ఎస్టీయూ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సమస్యలపై ఎంఈవో కె.లక్ష్మికి మంగళవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మున్సిపల్ పాఠశాలలలో జీవో 117 ప్రకారం ఎలాంటి ప్రమోషన్లు గతంలో జరగలేదని తెలిపారు. అదే విధంగా మున్సిపల్ ఉపాధ్యాయులకు ఆ జీవో వర్తిస్తుందని ఎక్కడా తెలపలేదన్నారు. మున్సిపల్ పాఠశాలల్లో కూడా జీవో 117 ప్రకారం సర్దుబాటు చేయాలనుకుంటే వెంటనే ప్రమోషన్స్ కోసం షెడ్యూల్ ప్రకటించి ప్రమోషన్ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఆ తర్వాత మాత్రమే మున్సిపాలిటీలలో సర్దుబాటు చేయాలంటే ప్రస్తుతం మున్సిపాలిటీలలో ఉన్న మెరిట్, సీనియారిటీ జాబితాల స్థానంలో మెరిట్ కమ్ రోస్టర్ సీనియారిటీ జాబితాలను సిద్ధం చేయాలన్నారు. అప్పుడు మాత్రమే సర్దుబాటు జరగాలని, అయితే జీవో నంబర్ 53 ప్రకారం మాత్రమే సర్దుబాటు చేయాలని కోరారు. సీనియర్లు విల్లింగ్ ఇస్తే తప్పక ఆమోదించాలని డిమాండ్ చేశారు. మండల ఉపాధ్యాయులను మండలంలోనే సర్దుబాటు చేయడాన్ని ఎస్టీయూ వ్యతిరేకిస్తుందన్నారు. జీవో 84 వల్ల ఉపయోగం లేనప్పుడు దానిని రద్దు చేసి మున్సిపల్ పాఠశాలలకు అర్బన్ ఎంఈవోను నియమించాలని కోరారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న మున్సిపల్ ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వకుండా జిల్లా పరిషత్ ఉపాధ్యాయులతో నింపే ప్రయత్నాలకు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు తెలిపారు. మున్సిపల్, కార్పొరేషన్ ఉపాధ్యాయులను అదే మున్సిపాలిటీ, కార్పొరేషన్‌లో సర్దుబాటు చేయాలని, మున్సిపల్ ఉపాధ్యాయుల కొరత ఉన్న చోట అకడమిక్ ఇన్‌స్ట్రక్టర్లను నియమించాలని కోరారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా కార్యదర్శి వినుకొండ అక్కయ్య, పట్టణ అధ్యక్షుడు మేకల కోటేశ్వరరావు, కార్యదర్శి వడ్లాన జయప్రకాష్, నాయకులు షేక్ జమీర్‌బాషా, షేక్ ఫరిసా, ఎస్ కాలేషా, అంకమ్మరావు, వెంకటస్వామి, ఏడుకొండలు, సాగర్‌బాబు పాల్గొన్నారు.

వర్క్‌షాపులతో జూనియర్ డాక్టర్ల ప్రతిభ మెరుగు

- ఏపీఎంసీ అబ్జర్వర్ డాక్టర్ పీఎస్ఎన్ మూర్తి
- డాక్టర్ కొండవీడులో నాలుగురోజుల పాటు సర్జికల్ వర్క్‌షాపు నిర్వహణ



వర్క్‌షాపులో పాల్గొన్న డాక్టర్లుతో నిర్వాహకులు డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి

నరసరావుపేట: ఆన్‌లైవ్ ఈఎన్‌టీ సర్జికల్ వర్క్‌షాపులను జూనియర్ డాక్టర్లు సద్వినియోగం చేసుకొని తమ ప్రతిభను మరింతగా మెరుగుపర్చుకోవాలని ఏపీ మెడికల్ కౌన్సిల్ అబ్జర్వర్ (ఏపీఎంసీ) డాక్టర్ పీఎస్ఎన్ మూర్తి సూచించారు. స్థానిక కొండవీడు ఈఎన్‌టీ హాస్పిటల్‌లో మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలో గత నాలుగు రోజులుగా నిర్వహించిన హాండ్స్ ఆన్‌లైవ్ సర్జికల్ వర్క్‌షాప్ ముగింపునకు కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు, విశిష్ట అతిథులుగా ఐఎంఏ మాజీ ప్రెసిడెంట్ డాక్టర్ ఏవీ రామలింగారెడ్డి, సీనియర్ ఈఎన్‌టీ సర్జన్ డాక్టర్ వై.మధుసూదన్, ఏవోఐ తెలంగాణ ప్రెసిడెంట్ డాక్టర్ శేఖర్‌రెడ్డి హాజరయ్యారు. ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించి వర్క్‌షాపు నిర్వహించినందుకు హాస్పిటల్ ఎండీని అభినందించారు. డాక్టర్ మూర్తి మాట్లాడుతూ ఇప్పుడు నిర్వహిస్తున్న వర్క్‌షాప్ కేవలం మెడికల్ కాలేజీలో తప్ప హాస్పిటల్స్‌లో నిర్వహించరని, ఈఎన్‌టీ విభాగంలో దేశంలోనే ఇటువంటి కార్యక్రమాన్ని ఇప్పటివరకు నిర్వహించలేదన్నారు. కొండవీడు హాస్పిటల్‌లో నిర్వహించటం చొరవ, సాహసంతో కూడుకున్న చర్య అన్నారు. అందుకు డాక్టర్ జగన్‌మోహన్ రెడ్డిని ప్రత్యేకంగా అభినందించారు. దీనికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచి నుంచి ఏడుగురు జూనియర్ డాక్టర్లు పాల్గొన్నారు. డాక్టర్లు నరేంద్ర, శ్రీవర్షిని, రామ మోహనరెడ్డి, సుధీర్ చంద్ర, సుధాకర్, బయ్యా సుధీర్, హాస్పిటల్ సీఈవో మస్తాన్ రెడ్డి, డైరెక్టర్ కోటిరెడ్డి, మేనేజర్ మహేష్, అశోక్, ఫార్మసిస్ట్ స్వామి పాల్గొన్నారు.

విద్యార్థులకు కాపీ రైటింగ్ పుస్తకాల పంపిణీ



వినుకొండ(నూజెండ్ల): నూజెండ్ల మండలం పెద్దవరం గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల పూర్వవిద్యార్థి దూపాటి కిరణ్ విద్యార్థులకు తెలుగు, ఇంగ్లీష్ కాపీ రైటింగ్ పుస్తకాలను అందజేశారు. పాఠశాల హెచ్‌ఎం ఘంటా నాగేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులందరూ మంచి దస్తూరి అలవాటు చేసుకోవాలని సూచించారు. దాత కిరణ్‌ను ప్రత్యేకంగా అభినందించారు.ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు సహకరించండి



నరసరావుపేట టౌన్: ట్రాఫిక్ నియంత్రణకు వ్యాపారులు సహకరించాలని టూటౌన్ ఎస్ఐ అశోక్ కుమార్ కోరారు. స్టేషన్ పరిధిలోని పలు ప్రధాన రహదారిలో రోడ్లు అక్రమించి వ్యాపారాలు నిర్వహిస్తున్న దుకాణాల వద్దకు మంగళవారం ఎస్ఐ సిబ్బందితో వెళ్లారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రోడ్లు ఆక్రమించటం వలన రాకపోకలకు అంతరాయం కలగటంతో పాటు నిత్యం ట్రాఫిక్ సమస్య ఉత్పన్నమౌతుందన్నారు. వ్యాపారులు తమ వంతు సహకరించి ట్రాఫిక్ నియంత్రణలో భాగస్వాములు కావాలని కోరారు. వ్యాపారులు తమ పంథాను మార్చుకోకుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ సైదా నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి ఓటర్ల జాబితా రీవెరిఫికేషన్

నాదెండ్ల: కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు బుధవారం నుంచి మండలంలో ఓటర్ల జాబితా వెరిఫికేషన్ నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ ఏవీ రమణ చెప్పారు. మండల పరిధిలోని 57 పోలింగ్ బూత్‌ల్లోని బీఎల్‌వోలు ప్రతి ఇంటిని సందర్శించి 18 ఏళ్లు నిండి ఓటుకు అర్హత పొందిన వారు, పీడబ్ల్యూడీ, మృతులు, వలస పోయిన వారి వివరాలు గుర్తించి నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. 2025 జనవరి 6 నాటికి స్పెషల్ సమ్మరీ రివిజన్ పూర్తి చేసి జాబితాను రూపొందించనున్నట్లు తెలిపారు.

కొండవీడు ఆస్పత్రిలో ఉచితంగా శస్త్రచికిత్సలు

రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో నిర్వహణ



హాస్పిటల్‌లో శస్త్రచికిత్సలు చేయించుకున్న వారితో డాక్టర్ జగన్‌మోహన్‌రెడ్డి, ఇతర డాక్టర్లు

నరసరావుపేట: జిల్లా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో కొండవీడు ఈఎన్‌టీ హాస్పిటల్‌లో 40 మందికి రూ.10 లక్షల విలువైన చెవి, ముక్కు, గొంతు వ్యాధుల శస్త్రచికిత్సలు ఉచితంగా చేసినట్లు రెడ్‌క్రాసు జిల్లా అధ్యక్షులు, హాస్పిటల్ అధినేత డాక్టర్ కంజుల జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం వెల్లడించారు. 78వ స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా ఆగస్టు 15న హాస్పిటల్‌లో ఈఎన్‌టీ వ్యాధులకు సంబంధించి ఉచిత వైద్య పరీక్షల శిబిరం ఏర్పాటు చేసిన విషయం విదితమే. ఈ వైద్య శిబిరంలో 210 మందిని పరీక్షించి వారిలో 55 మందిని శస్త్ర చికిత్సలకు ఎంపిక చేశామన్నారు. వారిలో 40 మందికి 17, 18, 19 ,20, తేదీలలో శస్త్రచికిత్సలు ఉచితంగా నిర్వహించామని, ఫార్మా డిస్ట్రిబ్యూటర్ సహకారంతో సుమారు రూ.3 లక్షల మేర మందులు ఉచితంగా పంపిణీ చేశామన్నారు. మరో 15 మందికి శస్త్ర చికిత్సలను నిర్వహించాల్సి ఉందని, వారికి కూడా రానున్న రెండు రోజులలో పూర్తిచేస్తామని ఆయన తెలియజేశారు.

మైనర్లకు వాహనాలు ఇస్తే చర్యలు



మైనర్ల తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ట్రాఫిక్ సీఐ రమేష్ బాబు



మైనర్ తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇస్తున్న రూరల్ సీఐ సుధాకర్‌రావు

ట్రాఫిక్ సీఐ రమేష్ బాబు

నరసరావుపేట టౌన్: మైనర్ యువకులకు వాహనాలు ఇస్తే వారి తల్లిదండ్రులపై చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ సీఐ రమేష్ బాబు హెచ్చరించారు. ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా మైనర్‌లు డ్రైవింగ్ చేస్తున్న పలు వాహనాలను సీజ్ చేసి స్టేష న్‌కు తరలించారు. వారి తల్లిదండ్రులకు స్టేషన్‌కు పిలిచి కౌన్సిలింగ్ నిర్వహించిన అనంతరం వాహనాలను విడిచిపెట్టారు. అదే విధంగా నెంబ ర్ ప్లేట్ లేని 10 వాహనాలపై కేసు నమోదు చేసి జరిమానా విధించారు. ఇకపై తరుచూ తనిఖీలు నిర్వహించి నిబంధనలు అతిక్రమించిన వాహనదారులపై చర్యలు తీసుకుంటామని సీఐ తెలిపారు.

టూటౌన్ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో తనిఖీలు ...

పెద్దచెరువులో టూటౌన్ ఎస్ఐ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించి సరైన పత్రాలు లేని ద్విచక్ర వాహనదారులపై కేసులు నమోదు చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన 12 మందిపై కేసు నమోదు చేసి అపరాధ రుసుం వసూలు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కేసులు నమోదు చేస్తాం

శావల్యాపురం: బైకులు, వాహనాలను మైనర్లు నడిపితే చట్టపరంగా కేసులు నమోదు చేస్తామని వినుకొండ రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్‌రావు హెచ్చరించారు. మంగళవారం శావల్యాపురం జాతీయ రహదారి మార్గంలో బైకులు నడుపుతున్న మైనరు పిల్లలు తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా రూరల్ సీఐ మాట్లాడుతూ చట్ట వ్యతిరేక పనులకు పాల్పడే వారిపై ఉక్కుపాదం మోపుతామన్నారు. మైనర్లకు వాహనాలు, బైకులు ఇవ్వటం ద్వారా ఏదైనా ప్రమాదం జరిగితే చర్యలు కఠినంగా ఉంటాయన్నారు. వాహనాలు తనిఖీల్లో ఎస్సై లేళ్ళ లోకేష్‌రావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

వి.రెడ్డిపాలెంలో ప్లకార్డులతో ర్యాలీ



ప్ల కార్డులతో నినాదాలు చేస్తున్న వైద్య ఆరోగ్య సిబ్బంది

రొంపిచర్ల: మండలంలోని వి.రెడ్డిపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ప్రపంచ దోమల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్లకార్డులతో ర్యాలీ నిర్వహించారు. దోమల సంతానోత్పత్తిని చేసే ప్రదేశాలను గుర్తించి లార్వాలను నిర్మూలించాలని నినాదాలు చేశారు. దోమల బెడద తగ్గినప్పుడు ఆరోగ్యవంతమైన సమాజం ఏర్పడుతుందన్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ చేశారు. విధి నిర్వహణలో తమ ఉద్యోగ ధర్మాలను పాటించి దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నుంచి ప్రజలను రక్షిస్తామన్నారు. దోమలు ఉత్పత్తి అయ్యే ప్రదేశాలను గుర్తించి సమూలంగా నిర్మూలిస్తామన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటిస్తామన్నారు. పరిసరాలను శుభ్రంగా ఉంచటంతో పాటు దోమల ద్వారా వచ్చే వ్యాధులపై ప్రజల్లో అవగాహన కల్పిస్తామని ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించటంలో తమ పాత్ర పోషిస్తూ ఆరోగ్య శాఖ పురోగమనానికి పాటుపడతామన్నారు. ప్రజా అభ్యున్నతికి ఎనలేని వైద్య ఆరోగ్య సేవలు అందించగలవారమని త్రికరణ శుద్ధిగా ప్రతిజ్ఞ చేశారు. ఈ ర్యాలీలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు, సూపర్‌వైజర్‌లు, ఏఎన్ఎంలు, ఆశాలు, ఎంపీహెచ్ఈవో సురేష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ స్కౌట్స్ మాస్టర్‌కు సన్మానం

నరసరావుపేట రూరల్: ఉత్తమ భారత్ స్కౌట్స్ అండ్ గైడ్స్ లీడర్ ట్రెయినర్‌గా అవార్డు పొందిన శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్ స్కౌట్స్ ఉపాధ్యాయుడు పమ్మి వెంకటరెడ్డిని మంగళవారం ఘనంగా సన్మానించారు. పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయినీ ఎం.పార్వతి, ఉపాధ్యాయులు వెంకటరెడ్డిని సత్కరించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయినీ పార్వతి మాట్లాడుతూ గత 22 సంవత్సరాలుగా స్కౌట్ ఉపాధ్యాయుడిగా వెంకటరెడ్డి విశేషసేవలు అందించారని తెలిపారు. ఎం స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర మంత్రి నాదెండ్ల మనోహర్ చేతుల మీదగా అవార్డు పొందడం పాఠశాలకు గర్వకారణమని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వరి విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలి



విత్తనాలను రైతులకు అందజేస్తున్న ఏవో రామారావు

శావల్యాపురం: ఖరీఫ్ సీజనులో వరి పంట సాగు రైతులందరూ రైతు సేవా కేంద్రాల్లో రాయితీపై ఇస్తున్న వరి విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి రామినేని రామారావు అన్నారు. మంగళవారం మండలంలోని శానంపూడి, మతుకుమల్లి రైతుసేవా కేంద్రాల్లో రైతులకు వరి విత్తనాలతో పాటు వివిధ రకాల పంటలు సాగు రైతుల పంట పొలాలను ఈ–క్రాప్ నమోదు కార్యక్రమాలను నిర్వహించారు.
ఈసందర్భంగా ఏవో మాట్లాడుతూ ఈ–క్రాప్ నమోదు చేయించుకోవటం వలన రైతులకు అనేక రకాల ప్రయోజనాలు పొందుతారన్నారు. రైతు సేవా కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తున్న పథకాలు, కౌలు రైతులకు పంట సాగు ధ్రువీకరణ పత్రాలను అర్హత కల్గియున్న రైతులు సద్వినియోగం చేసుకొని ఆశించిన స్థాయిలో మంచి దిగుబడులు సాధించాలన్నారు. రైతుసేవా కేంద్రాల్లో నిరంతరం వీఏఏలు అందుబాటులో ఉంటారని వ్యవసాయపరమైన సలహాలు సూచనలు పొందాలన్నారు.

ఓటర్ల జాబితా సవరణపై ఇంటింటి సర్వే



సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న తహసీల్దారు వెంకట నాగరాజు

శావల్యాపురం: ఓటర్ల జాబితా సర్వే కార్యక్రమానికి ప్రజలందరూ సహకరించాలని తహసీల్దారు వేముల వెంకట నాగరాజు అన్నారు. మంగళవారం శావల్యాపురం బీసీ కాలనీలో సర్వే కార్యక్రమాన్ని రెవెన్యూ అధికారులు పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దారు మాట్లాడుతూ మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో 39 పోలింగ్ కేంద్రాల్లోని బీఎల్‌వోలు ఓటర్ల జాబితాలో మార్పులు చేర్పులు తదితర సవరణలు చేయడానికి అవకాశం ఎన్నికల కమిషనర్ ఏర్పాటు చేసిందన్నారు. అలాగే వయోజనులు 18 సంవత్సరాలు నిండిన వారందరూ నూతన ఓటు హక్కు కల్పించటానికి చర్యలు తీసుకున్నామన్నారు. ఇంటి పేరు, ఇంటి అడ్రస్, పేర్లు సవరణలు, వలసలు వెళ్లిన వారందరి ఓట్లు మార్పులు చేర్పులు చేసుకోవచ్చునన్నారు. ఈ కార్యక్రమం అక్టోబరు 18 వరకు జరుగుతుందన్నారు. ఇంటింటి సర్వేలో ఆర్ఐ బాబు, వీఆర్వోలు మల్లెల రాధ, ఉప్పుటూరి చిన మంగయ్య, పంచాయతీ కార్యదర్శి కానుగంటి మహేంద్ర, బీఎల్‌వో రంతు లక్ష్మణ్ ఉన్నారు.

భారత్‌బంద్‌ను జయప్రదం చేయండి

నరసరావుపేట: ఎస్సీ వర్గీకరణ, క్రీమిలేయర్‌పై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు వ్యతిరేకంగా బుధవారం నిర్వహిస్తున్న భారత్ బంద్‌ను నరసరావుపేటలో విజయవంతం చేయాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ గోదా జాన్‌పాల్ కోరారు. ఈ మేరకు మంగళవారం బంద్‌కు సహకరించాలని కోరుతూ ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద్‌బాబు, డీఆర్‌ఓ కె.వినాయకం, బులియన్ మర్చంట్ అధ్యక్షులు వనమా సాంబశివరావు, పలు ప్రైవేటు విద్యాసంస్థల అధిపతులకు వినతిపత్రాలు అందజేశారు.
పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న మాల నాయకులు, మహిళలు, విద్యార్థులు, ప్రజాస్వామ్యవాదులు ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి మాయావతి పిలుపుమేరకు బీఎస్పీ నాయకులు వేలాదిగా తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు.

మహిళా భద్రతపై అవగాహన సదస్సు

నరసరావుపేట ఈస్ట్: విద్యార్థినులు ఆత్మస్థైర్యంతో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని రూరల్ ఎస్ఐ లేఖప్రియాంక ఆకాంక్షించారు. రావిపాడురోడ్డులోని వాగ్దేవి డిగ్రీ కళాశాలలో మంగళవారం విద్యార్థినులతో యాంటీ డ్రగ్స్, ర్యాగింగ్, మహిళా భద్రత తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. సదస్సులో ఎస్ఐ లేఖ ప్రియాంక మాట్లాడుతూ, విద్యార్థినులను వెన్నుతట్టి ప్రోత్సహించాలని తెలిపారు. సమాజంలో ఎటువంటి సమస్య ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొవాలన్నారు. శారీరక, మానసిక దృఢత్వంతో ముందుకు సాగాలని తెలిపారు. మహిళా భద్రతపై విద్యార్థినిలకు అవగాహన కల్పించి సమస్య ఎదురైనప్పుడు పోలీసులకు తెలియచేసి పరిష్కారం పొందాలని సూచించారు. అలాగే విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని తెలిపారు. కళాశాల కార్యదర్శి రాయల శ్రీనివాసరావు, ప్రిన్సిపల్ కపలవాయి రాజేంద్రప్రసాద్, డైరెక్టర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.


ప్రథమ వర్ధంతి
మీరు మా నుండి దూరమై సం॥ అయినప్పటికి
మీ జ్ఞాపకాలు మా మదిలో పదిలం..
మీ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తూ..
జననం : 1933 మరణం : 21-08-2023

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25439
90105 83302 (నరసరావుపేట)
90102 03704 (చిలకలూరిపేట)
97054 44152 (వినుకొండ)
Office mail : sakshigntadvt@gmail.com